# బాస్ రాక

- జన నేత కోసం ఎదురుచూస్తున్న మహబూబ్‌నగర్, కోస్గి
- నేడు రెండు చోట్ల ప్రజా ఆశీర్వాద సభలు
- ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, పట్నం మహేందర్‌రెడ్డి



మహబూబ్‌నగర్‌లో సీఎం సభా ప్రాంగణం



కోస్గిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ యోగేశ్‌గౌతమ్



మహబూబ్‌నగర్‌లో బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

మహబూబ్‌గర్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బుధవారం ఉమ్మడి పాలమూరు జిల్లాకు వస్తున్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రాతినిథ్యం వహిస్తున్న మహబూబ్‌నగర్‌తో పాటు నారాయణపేట జిల్లా కోస్గిలో జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో కోస్గిలో సభ నిర్వహించడం.. ఈ సెగ్మెంట్ నుంచి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పోటీ చేస్తుండడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యతను సంతరించుకున్నది. ఈ నియోజకవర్గాన్ని బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. రెండు సభల కోసం మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహేందర్‌రెడ్డి రెండ్రోజులుగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల ముఖ్యఘట్టమైన ప్రచారం చివరి దశకు చేరడంతో గులాబీ దళపతి పాల్గొంటున్న ప్రజా ఆశీర్వాద సభలు కాక రేపుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 11 నియోజకవర్గాల్లో అధినేత విస్తృతంగా పర్యటించారు.

### గులాబీమయంగా..

నేటి పర్యటన నేపథ్యంలో రెండు ప్రాంతాలు గులాబీమయంగా మారాయి. కనీవిని ఎరుగని రీతిలో నిర్వహించేందుకు గులాబీశ్రేణులు సన్నాహాలు చేపట్టారు. ప్రతి గ్రామం నుంచి పార్టీ కార్యకర్తలను, ప్రజలను భారీగా తరలించేలా పక్కా ప్లాన్ చేశారు. పాలమూరులోని బాయ్స్ కాలేజీ మైదానంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. 2018 ఎన్నికల సమయంలోనూ ఇదే వేదికగా జరిగిన సభలో సీఎం కేసీఆర్ ఈసారి శ్రీనివాస్‌గౌడ్ గెలిస్తే మంత్రి పదవి ఇస్తానని చెప్పిన విధంగానే భారీ మెజార్టీతో గెలుపొందిన శ్రీనన్నకు అధినేత అమాత్య పదవి కట్టబెట్టి కానుకగా అందించారు. అంతటితో ఆగకుండా కీలకమైన శాఖలను అప్పగించారు. తర్వాత ప్రభుత్వంలో ఆయన కీలకంగా మారిపోయారు. ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రంలోనే తొలిసారిగా కేసీఆర్ అర్బన్ పార్కును పార్టీ అధినేత పేరుపై ఏర్పాటు చేశారు. ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లకు కూడా కేసీఆర్ నగర్, కేటీఆర్ నగర్‌గా నామకరణం చేసి సంచలనానికి దారి తీశారు. కొడంగల్‌లో రేవంత్‌ను తొడగొట్టి ఓడించిన పట్నం మహేందర్‌రెడ్డిని ఈ ఏడాది చివర్లో మంత్రివర్గంలోకి తీసుకున్నారు. దీంతో కోస్గిలో ఏర్పాటు చేసే ప్రజా ఆశీర్వాద సభ కూడా కీలకంగా మారింది.

### కోస్గి సభపైనే దృష్టంతా..

కొడంగల్ నియోజకవర్గం రాష్ట్రంలో ఉత్కంఠను రేపుతోంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఘోరంగా ఓడించిన పట్నం నరేందర్‌రెడ్డికే మరోసారి బీఆర్‌ఎస్ టికెట్ ఇచ్చి పోటీలో నిలబెట్టింది. అంతేకాకుండా రేవంత్ ఈసారి ఎలాగైనా ఓడించాలని పట్నం సోదరులు కంకణం కట్టుకున్నారు. ఇందులో భాగంగా ముందే ఓటమిని ఊహించిన రేవంత్ ఏకంగా కేసీఆర్ పోటీ చేసే కామారెడ్డి బరిలో నిల్చొని అక్కడ కూడా ఓటమిని మూటగట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు.. దీంతో కోస్గిలో జరిగే ఎన్నికల ప్రచార తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. రాష్ట్రం మొత్తం ఇక్కడ జరిగే సభా వేదికపై మాట్లాడే ప్రసంగాన్ని ఆసక్తిగా తిలకించబోతుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో నెలకొన్నది. అట్టహాసంగా నిర్వహించేందుకుగానూ భారీ జన సమీకరణను చేసి సత్తా చాటే ప్రయత్నంలో పట్నం సోదరులు నిమగ్నమయ్యారు. నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున సమీకరించేందుకు ఇప్పటికే కార్యకర్తలు, నాయకులతో సమన్వయం చేసుకొని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల కోస్గిలో జరిగిన సభలో రేవంత్ చీప్ కామెంట్లు చేయడం.. ఆ తర్వాత జనం రాక కాంగ్రెస్ పార్టీ నేతలు తలలు పట్టుకున్న విషయం తెలిసిందే.. ఓటమిని ముందే గ్రహించిన ఆ పార్టీ నేతలు బీఆర్‌ఎస్ నేతలను కొనుగోలు చేసే ప్రయత్నంలో పడి విఫలం కూడా అయ్యారు. ఇంత తక్కువ జనం వస్తే రేవంత్ ఎలా గెలుస్తాడని హస్తం పార్టీకి చెందిన ఓ నేత వ్యాఖ్యానించడం ఇందుకు నిదర్శనం.

### సెంటిమెంట్‌కు అనుగుణంగా..

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కేసీఆర్ చేపట్టే ప్రజా ఆశీర్వాద సభకు మంత్రి దగ్గరుండి ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాలమూరు పట్టణమంతా గులాబీమయంగా మారింది. 2018లోనూ ఇదే మైదానంలో ఎన్నికల సభ నిర్వహించి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఘన విజయం సాధించగా.. సెంటిమెంట్ మేరకు మళ్లీ అక్కడే సీఎం కేసీఆర్ సభను నిర్వహిస్తున్నారు. భారీగా జన సమీకరణ చేసేందుకు పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. బహిరంగ సభకు వెళ్లే దారి మొత్తం గులాబీమయంగా మారింది. భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు వెలిశాయి.

# పేటలో ఓటు అడిగే హక్కు లేదు

- జిల్లా చేసినం.. మెడికల్ కాలేజ్ తెచ్చిన
- అప్పక్‌పల్లి, కిందితండా, మీదితండాల్లో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ప్రచారం

మహబూబ్ నగర్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/నారాయణపేట రూరల్, నవంబర్ 21 : నారాయణపేటను జిల్లాను చేసినం.. మెడికల్ కాలేజ్ తెచినం.. ఓటు అడిగే ఒక్క బీఆర్‌ఎస్‌కే ఉంది.. కాంగ్రెస్ బీజేపీకి ఓటు అడిగే హక్కులేదని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. మన బతుకు కోసం ఓటు వేయాలి.. కాంగ్రెస్ ఐదు గ్యారంటీలు అన్నీ తుస్.. కర్ణాటకలో ప్రభుత్వం ఏం చేస్తుందో అందరికీ తెలుసన్నారు. రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ సాల్తదని చెబుతున్నాడు.. మూడు గంటలు సరిపోతాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మాటలను నమ్మొద్దన్నారు. పోయిన ఎన్నికల్లో మాట ఇచ్చిన విధంగా జిల్లాను చేసినం.. కలెక్టర్ ఆఫీస్ కడతున్నం.. ఎస్పీ ఆఫీస్ కడుతున్నం.. జిల్లా ఆస్పత్రి తెచ్చినం.. అప్పక్‌పల్లి నుంచి రోడ్డు వేస్తున్నాం.. భవిష్యత్‌లో ఇక్కడ జంక్షన్ చేస్తామన్నారు. మూడు గంటల కరెంట్ కావల్నా..24 గంటలు కరెంట్ కవాల్నా.. మూడు గంటలు కావాలంటే కాంగ్రెస్‌కు ఓటేయండి, 24గంటలు కావాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటెయ్యాలని కోరారు. త్వరలో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తీసుకొచ్చి రైతుల పాదాలు కడుగుతామన్నారు. ఈ ఎత్తిపోతల పూర్తయితే ఇక్కడ ఎకరం నాలుగు కోట్లు పలుకుతుందన్నారు. భవిష్యత్‌లో అప్పక్‌పల్లి బంజారా హిల్స్‌లా చేస్తానన్నారు. అంతకు ముందు గ్రామంలో భారీ స్వాగతం పలికారు. పటాకులు కలుస్తూ ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ అమ్మ కోళ్ల శ్రీనివాస్ రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, సర్పంచ్ వెంకటమ్మ పాల్గొన్నారు.



అప్పక్‌పల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి

### బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కోయిలకొండ, నవంబర్ 21: బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ మరింత అభివృద్ధి సాధ్యమని ఢిల్లీ పాలకుల చేతిలోకి వెళ్తే ఆగం చేస్తారని నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం శేరివెంకటాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో మండలంలోని వింజమూరు, ఎల్లారెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రాములు, వాల్యానాయక్, భీమయ్య, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దామరగిద్ద మండలంలో రోడ్‌షో

దామరగిద్ద, నవంబర్ 21: మండలంలోని మొగల్‌మడ్క, అన్నాసాగర్‌లో ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. అనంతరం మండంల కేంద్రంలో వివిధ పార్టీలకు చెందిన 100 మంది వన్నడి చంద్రకాంత్ అధ్వర్యంలో ఎమ్మెల్యే ఎస్ఆర్. రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మండలకేంద్రానికి చెందిన భజన భక్త మండలి సభ్యులతోపాటు వివిధ పార్టీలవారిని బీఆర్‌ఎస్ అధికారంలో ఉంటే వచ్చే సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధి గురించి వివరించడంతో వారు పార్టీలోకి వచ్చారని వన్నడి చంద్రకాంత్ తెలిపారు. అంతకుముందు బాపన్‌పల్లిలో గజలేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సంక్షేమపథకాలు, గ్రామాల అభివృద్ధి గురించి వివరించడంతో వారు పార్టీలోకి వచ్చారని వన్నడి చంద్రకాంత్ తెలిపారు. కార్యక్రమంలో వన్నడి సురేశ్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు అశోక్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇరవై ఏండ్లు వెనక్కే..

- కారు గుర్తుకు ఓటేసి మరోసారి ఆశీర్వదించాలి
- జడ్చర్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి




మిడ్జిల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిడ్జిల్/జడ్చర్ల, నవంబర్ 21: మోసపూరిత వాగ్ధానాలు, చుట్టపుచూపుగా వచ్చే నాయకులను నమ్మి ప్రజలు మోసపోరాదని, ఎన్నికల్లో ఆలోచించి సంక్షేమం, అభివృద్ధికి పాటుపడే పార్టీకి ఓటు వేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిల్వేర్, అయ్యవారిపల్లి, వెలుగొమ్ముల, కొత్తూర్, మల్లాపూర్, లింబ్యాతండా, చేదుగట్టుతండా, కొత్తపల్లి, బోయిన్‌పల్లి, రాణిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అలాగే జడ్చర్లలోని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన వెంకటేశ్‌గౌడ్, అభిషేక్‌గౌడ్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. నిమ్మబావిగడ్డకు చెందిన కొంతమంది యువకులు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కారుగుర్తుకు ఓటు వేసి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాండు, ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ శశిరేఖ, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు జంగిరెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు తదితరులు ఉన్నారు.

## అధికారం కోసం కాంగ్రెస్ మాయమాటలు

- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి




అడ్డాకులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మూసాపేట(అడ్డాకుల), నవంబర్ 21: ఎలాగైనా సరే అధికారం చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకోవాలని చూస్తుందని, ప్రజలు చైతన్యంతో ఆలోచించి ఓటు వేయాలని దేవరదక్ర ఎమ్మెలే ఆల వెంకటేశ్వర్ రెడ్డి చెప్పారు. మంగళవారం అడ్డాకుల మండల కేంద్రంతోపాటు, శాఖాపూర్, గుడిబండ, తిమ్మాయిపల్లి, తిమ్మాయిపల్లితండాల్లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెలే ఆల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్చీ కోసం అవగాహన లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడుతూ, అబద్ధపు ప్రచారం చేస్తూ గ్రామాల్లో పర్యటిస్తూన్నారని, వారంతా ఈనెల 30వ తేదీ తర్వాత మళ్లీ కనుమరుగవుతారని పేర్కొన్నారు. మూడోసారి కూడా భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జిల్లా నాయకులు ప్రదీప్‌కుమార్‌గౌడ్, బాలమణెమ్మ, చందుగౌడ్, గట్టు చిన్నతిమ్మప్ప, ఎంపీపీ నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ అంటనే రైతులకు భరోసా

- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



కన్మనూర్‌లో మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మరికల్, నవంబర్ 21: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రైతులకు నల్ల చట్టం తెచ్చి 700మందిని బలితీసుకుందని, కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ అక్కడి రైతులకు కరెంట్ కష్టాలు తెచ్చిపెట్టిందని, రైతులకు బీఆర్‌ఎస్ అంటేనే భరోసా ఉందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మరికల్ మండలంలోని బుడ్డెగానితండా, గాజులయ్యతండా, కన్మనూర్, ఏక్లాస్‌పూర్, జిన్నారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామ్మోహన్‌రెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. రైతు సంక్షేమం కోరే బీఆర్‌ఎస్, కారు గుర్తుకు ప్రజలు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మరికల్ ఎంపీపీ శ్రీకళారెడ్డి, కన్మనూర్ ఎంపీటీసీ రాజు, సర్పంచులు రాములునాయక్, పద్మమ్మ, భాస్కర్, నాయకులు రమేశ్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చింతలయ్య, సాయిరెడ్డి, నర్వమండల అధ్యక్షుడు హరీశ్వర్‌రెడ్డి, అయ్యన్న, కన్మనూర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.